
సాక్షి
మంచిర్యాల
మంగళవారం । 28 । ఫిబ్రవరి । 2023



ఢిల్లీ మెచ్చిన పంచాయతీ 10లో▸

ముఖరా(కె) పంచాయతీ ఓడీఎఫ్ ప్లస్‌గా జాతీయస్థాయిలో గుర్తింపు సాధించింది. మార్చి 4న రాష్ట్రపతి చేతుల మీదుగా సర్పంచ్ మీనాక్షి అవార్డు అందుకోనున్నారు.



Applicant Having Land, hence not recommended

Applicant Having Own House not recommended

Applicant Having Land, hence not recommended

'డబుల్' మిస్టేక్! 8లో▸

డబుల్ బెడ్రూం ఇళ్ల అర్హుల జాబితా తప్పుల తడకగా మారింది. అర్హతలున్న వారి పేర్లను తొలగించి అనర్హుల పేర్లు జాబితాలో చేర్చారని నిరుపేదలు ఆందోళన చెందుతున్నారు.

గరిష్టం/కనిష్టం
35.0 /19.0

వాతావరణం

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉంది. ఆగ్నేయం దిశగా గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

టీజీబీ రుణాల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న అధికారులు

కాసిపేట: మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో సోమవారం తెలంగాణ గ్రామీణ బ్యాంకు(టీజీబీ) ముత్యంపల్లి శాఖ ఆధ్వర్యంలో మహిళా సంఘాలకు రుణాలు పంపిణీ చేశారు. తెలంగాణ గ్రామీణ బ్యాంకు జనరల్ మేనేజర్ కే.వీ.ప్రసాద్, రీజినల్ మేనేజర్ మురళి మనోహర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో రూ.20కోట్ల రుణాలను మహిళా స్వయం సహాయక సంఘాలకు అందజేసినట్లు తెలిపారు. కాసిపేట, బెల్లంపల్లి, మందమర్రి మండలాలకు చెందిన పలు స్వయం సహాయక సంఘాలకు రూ.10 కోట్ల చెక్కులను పంపిణీ చేశారు. డీఆర్‌డీఓ శేషాద్రి మాట్లాడుతూ మహిళా సంఘాలు రుణాలు తీసుకొని సక్రమంగా చెల్లిస్తుండడంతో ఒక్కో సంఘానికి రూ.20 లక్షలు రుణం ఇస్తున్నట్లు తెలిపారు. అనంతరం బ్యాంకు లింకేజీలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన సెర్ప్ సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్‌డీఓ ఎస్.శ్రీనివాస్, ఎంపీపీ రొడ్డ లక్ష్మీ, డీపీఎం స్వర్ణలత, బ్యాంకు మేనేజర్ రాజేష్‌ప్రసాద్ పాల్గొన్నారు.

బాలుడిపై పిచ్చికుక్క దాడి



గాయపడిన బాలుడు

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలో పిచ్చికుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. కాలనీల్లో చిన్నపిల్లలు, పెద్దవాళ్లపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. సోమవారం పట్టణంలోని రెండో జోన్ ఏరియాలో కటికె దుకాణాల వద్ద కల్యాంత్(8) ఆడుకుంటుండగా ఒక్కసారిగా కుక్క దాడి చేసింది. పలుచోట్ల గాయాలయ్యాయి. బాలుడు అరవడంతో కుటుంబ సభ్యులు వచ్చి కుక్కను కొట్టడంతో పారిపోయింది. అదే కుక్క మరికొద్ది మందిపై దాడి చేసినట్లు తెలిసింది.

5న పోరు పాటల నీరాజనం సభ



పోస్టర్లు విడుదల చేస్తున్న సీపీఐ నాయకులు

బెల్లంపల్లి: ప్రజాకవి గూడ అంజయ్య యాదిలో భాగంగా మార్చి 5న బెల్లంపల్లిలోని ఏఎంసీ మైదానంలో పోరు పాటల నీరాజనం సభ నిర్వహించనున్నట్లు సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఎం.వెంకటస్వామి, సీనియర్ నాయకుడు చిప్ప నర్సయ్య తెలిపారు. సోమవారం బెల్లంపల్లి ప్రెస్‌క్లబ్‌లో వాల్‌పోస్టర్లు, కరపత్రాలు విడుదల చేశారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో తన పాటలతో గూడ అంజయ్య ప్రజా చైతన్యానికి తోడ్పడ్డారని తెలిపారు. ఈ సభకు సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ, ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ, సినీ దర్శకుడు ఆర్.నారాయణమూర్తి, ప్రజా గాయకుడు గద్దర్, సినీ సంగీత దర్శకుడు వందేమాతరం శ్రీనివాస్, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న తదితరులు హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ బెల్లంపల్లి పట్టణ కార్యదర్శి డీఆర్ శ్రీధర్, ఏఐటీయూసీ డివిజన్ అధ్యక్షుడు ఎల్తూరి శంకర్, నాయకులు బియ్యాల ఉపేందర్, తిరుమలేష్, గుండా ప్రశాంత్, రాంచందర్ పాల్గొన్నారు.

పోస్టర్ల విడుదల

తాండూర్: పోరుపాటల నీరాజనం సభ పోస్టర్లను సోమవారం తాండూర్ సీపీఐ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు మామిడాల రాజేశం, తాండూర్ మండల కార్యదర్శి సాలిగామ సంతోష్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు పట్టి శంకర్, బయ్య మొగిలి, కొలిపాక బాస్కర్, శంకర్, రమేష్, కంబాల రాజు పాల్గొన్నారు.

ఈపీఎఫ్ సమస్యలు పరిష్కరించుకోండి

మంచిర్యాలటౌన్: ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు ఈపీఎఫ్‌పై సందేహాలను నివృత్తి చేసుకోవాలని ఈపీఎఫ్‌వో అకౌంట్స్ ఆఫీసర్ బి.సురేశ్‌కుమార్ అన్నారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఈపీఎఫ్‌వో కరీంనగర్ రీజియన్ కార్యాలయం పరిధిలో నిధి ఆప్‌కే నికట్ 2.0 కార్యక్రమంలో భాగంగా ఈపీఎఫ్‌పై అభ్యంతరాలు, ఫిర్యాదులు నిర్వహించారు. అకౌంట్స్ ఆఫీసర్ మాట్లాడుతూ ప్రతీ నెల 27న అన్ని జిల్లా కేంద్రాలతోపాటు ఎక్కువ ఉంది ఉద్యోగులు ఉన్నచోట నిధి ఆప్‌కే నికట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని అన్నారు. సీనియర్ అసిస్టెంట్ టి.పవన్‌కుమార్, జూనియర్ అసిస్టెంట్ కె.వంశీ పాల్గొన్నారు.

లంచావతారులు!

- ప్రభుత్వ ఉద్యోగుల్లో అవినీతి జబ్బు
- విసిగిపోయి ఏసీబీని ఆశ్రయిస్తున్న బాధితులు
- ఏసీబీకి చిక్కిన మంచిర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ సెక్రెటరీ శారద



మంచిర్యాల ఏఎంసీ స్పెషల్ గ్రేడ్ సెక్రెటరీ కె.శారద

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: అవినీతి అధికారులతో తీరుతో బాధితులు విసిగిపోతున్నారు. జిల్లాలో కొందరు అధికారులు తమ విధులు నిర్వర్తించేందుకు కూడా డబ్బుల కోసం ముప్పుతిప్పలు పెడుతున్నారు. అలా విసిగిపోయిన ఓ బాధితుడు అవినీతి అధికారిని ఏసీబీకి పట్టించాడు. సోమవారం మంచిర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ స్పెషల్ గ్రేడ్ సెక్రెటరీ కె.శారద గద్దెరాగడికి చెందిన పత్తి వ్యాపారి విశ్వేశ్వర్ నుంచి రూ.65వేలు లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ)కు అడ్డంగా దొరికిపోయారు. గత నాలుగు నెలలుగా పత్తి వ్యాపారిని లైసెన్స్ జారీ కోసం రిపోర్టుకు రూ.లక్ష డిమాండ్ చేసి చివరకు రూ.80వేలు ఇవ్వాలని ఒత్తిడి తెచ్చింది. భరించలేక బాధితుడు ఏసీబీని ఆశ్రయించడంతో ఆమె జైలు పాలైంది. జిల్లాలో ఇదే తీరున కొంతమంది లంచగొండి అధికారులు డబ్బుల వసూలుకు తెగబడుతున్నారు. గతంలో జిల్లా నుంచి కొందరు అధికారులు లంచం తీసుకుంటూ జైలు పాలయ్యారు. అయినా ఇంకా కొందరిలో మార్పు రావడం లేదు. ప్రభుత్వం నుంచి రూ.లక్షల కొద్దీ జీతాలు తీసుకుంటున్నప్పటికీ లంచం తీసుకోవడం మానడం లేదు. తమ డ్యూటీ చేసేందుకు ప్రజల నుంచి డబ్బులు అడుగుతున్నారు. కింది నుంచి పై స్థాయివరకు ఈ తంతు కొనసాగుతోంది. రెవెన్యూ, రిజిస్ట్రేషన్లు, ఆర్టీఏ, పోలీసు, పంచాయతీ, ఆర్అండ్‌బీ, ఇంజినీరింగ్ విభాగాలు, మున్సిపల్, పంచాయతీ, ట్రెజరీ, పౌరసరఫరాలు, విద్యుత్, ఎక్సైజ్, ఖనిజ ఇలా ప్రజలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సేవలు అందించే కొన్ని శాఖల్లో కొందరు ఆఫీసర్లకు డబ్బుల దుర్బుద్ధి పోవడం లేదు. చాలామంది పౌరులు లంచం జాడ్యం సమస్య ఎదుర్కొంటున్నప్పటికీ ధైర్యంగా ఏసీబీకి ఫిర్యాదు చేసేవారి సంఖ్య తక్కువగా ఉందని అధికారులు చెబుతున్నారు.



మాకు రోజు అనేకమంది నుంచి ఫోన్ కాల్స్ వస్తాయి. కానీ సంబంధిత అవినీతి అధికారిని పట్టించే వరకు మాకు సహకరించడం లేదు. కొందరే మేం చెప్పినట్లు చేసి ఆధారాలతో అధికారులను పట్టుకునేలా చేస్తున్నారు. అవినీతిపరుల్ని పట్టించడంలో అందరూ ముందుకు రావాలి.

– ఆదిలాబాద్ రేంజ్(ఎఫ్ఏసీ) ఏసీబీ డీఎస్పీ భద్రయ్య

అవినీతిపరుల ఆటకట్టించండి

ఏసీబీ ఆదిలాబాద్ ఆఫీసు నంబరు **08732 226307**

ఏసీబీ డీఎస్పీ **91543 88954**

జిల్లాలో ఏసీబీ దాడులు

- 2021 జులైలో బెల్లంపల్లి పట్టణ టౌన్ ఎస్సై, ఆయన డ్రైవర్ స్టేషన్ బెయిల్ ఇచ్చేందుకు ఓ బాధితుడి నుంచి రూ.1.20లక్షల లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కారు.
- 2019లో జన్నారం మండల రెవెన్యూ శాఖలో సర్వేయర్ ఓ రైతు నుంచి రూ.3వేలు తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు.
- 2017లో మండల స్థాయి అధికారి కాంట్రాక్టరు నుంచి బిల్లుల్లో పర్సంటేజీ డిమాండ్ చేస్తూ రూ.16వేలు తీసుకుంటూ ఓ హోటల్‌లో పట్టుబడ్డారు.
- 2015లో ఇద్దరు సాగునీటి పారుదల శాఖ ఈఈ, చెన్నూరు డీఈ బిల్లులు మంజూరు కోసం మిషన్ కాకతీయ కాంట్రాక్టరు నుంచి ఈఈ, రూ.40వేలు, డీఈ రూ.60వేలు తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు.

ఏసీబీకి చిక్కిన మార్కెట్ కమిటీ కార్యదర్శి

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: మంచిర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ స్పెషల్ గ్రేడ్ సెక్రెటరీ కె.శారద లంచం తీసుకుంటూ సోమవారం ఏసీబీకి చిక్కారు. ఆదిలాబాద్ రేంజ్ ఇన్చార్జి, ఏసీబీ డీఎస్పీ కె.భద్రయ్య తెలిపిన వివరాల ప్రకారం.. రామక్రిష్టాపూర్ పట్టణం గద్దెరాగడికి చెందిన పత్తి వ్యాపారి విశ్వేశ్వర్ హనుమాన్ ట్రేడర్స్ పేరుతో పత్తి వ్యాపారం చేస్తున్నాడు. గత నవంబర్‌లో మార్కెటింగ్ శాఖకు లైసెన్స్ కోసం దరఖాస్తు చేశాడు. మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాలతో స్థానిక సెక్రెటరీ తనిఖీ చేసి లైసెన్స్ జారీ కోసం రిపోర్టు ఇవ్వాల్సి ఉంది. ఇందుకోసం బాధితుడి నుంచి సెక్రెటరీ కె.శారద రూ.లక్ష డిమాండ్ చేశారు. చివరకు రూ.80వేలకు బేరం కుదిరింది. ఈ నెల 14న రూ.15వేలు ఇవ్వడంతో తనిఖీ రిపోర్టు ఇవ్వగా లైసెన్సు జారీ అయింది. మిగతా డబ్బులు కూడా ఇవ్వాలని సెక్రెటరీ పదే డిమాండ్ చేయగా, బాధితుడు విసిగిపోయి ఏసీబీని ఆశ్రయించాడు. రంగంలోకి దిగిన ఏసీబీ, సెక్రెటరీ తన కార్యాలయంలోనే రూ.65వేలు తీసుకుంటుండగా పక్కా ప్లాన్‌తో పట్టుకున్నారు. అనంతరం నిందితురాలిని కరీంనగర్ ఏసీబీ స్పెషల్ కోర్టులో హాజరు పర్చనున్నట్లు డీఎస్పీ తెలిపారు. డీఎస్పీ వెంట సీఐలు, ఇతర సిబ్బంది ఉన్నారు. మంచిర్యాలకు బదిలీపై వచ్చిన కె.శారద లైసెన్సుల జారీ విషయంలో స్థానిక వ్యాపారుల నుంచి డబ్బులు డిమాండ్ చేస్తోందనే ఆరోపణలు ఉన్నాయి. గతంలో నాగర్‌కర్నూల్ జిల్లాలో పని చేసినప్పుడు అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి.

'ప్రజావాణి'లో సమస్యలు పరిష్కారం



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ సంతోష్

పాతమంచిర్యాల: ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి అధికారుల సమన్వయంతో పరిష్కరిస్తామని చెప్పారు. భూ సమస్యలు, డబుల్ బెడ్రూం ఇళ్లు, ధరణి, భూమి క్రమబద్ధీకరణ, పట్టాపాస్‌పుస్తకం, ఇసుక రవాణాకు అనుమతి ఇవ్వాలని అర్జీలు సమర్పించారు. కన్నెపల్లి మండలం వీరాపూర్‌కు చెందిన చంద్రయ్య గ్రామంలోని దుబ్బగూడెం ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ ముంపునకు గురైన భూమికి నష్టపరిహారం ఇప్పించాలని దరఖాస్తు చేసుకున్నాడు.

'పది' సీబీఎస్ఈ పరీక్షలు ప్రారంభం

మంచిర్యాలఅర్బన్: స్థానిక కేంద్రీయ విద్యాలయంలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో పదో తరగతి (సీబీఎస్ఈ) పరీక్షలు సోమవారం ప్రారంభం అయ్యాయి. ఉదయం 10.30గంటల నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు పరీక్షలు జరిగాయి. మొదటి రోజు ఇంగ్లిష్ పరీక్షకు 131 మంది హాజరయ్యారు. విద్యార్థులు పరీక్ష నిర్ణీత సమయం కంటే అరగంట ముందుగా వచ్చారు. క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం పరీక్ష కేంద్రంలోకి అనుమతించారు. కార్మెల్ హైస్కూల్(సీబీఎస్ఈ)కు చెందిన 70 మంది, ఉషోదయ హైస్కూల్‌కు చెందిన 31 మంది, కేంద్రీయ విద్యాలయానికి చెందిన 30 మంది హాజరయ్యారు.

కుక్కలు, కోతులతో ఇబ్బందులు

- రోడ్ల నిర్మాణాలు చేపట్టాలి
- 'సాక్షి' ఫోన్ ఇన్‌లో ప్రజల నుంచి వెల్లువెత్తిన ఫిర్యాదులు
- సమస్యలు పరిష్కరిస్తామని మున్సిపల్ కమిషనర్ వెల్లడి



కమిషనర్ వెంకటనారాయణ

రామకృష్ణాపూర్: కుక్కలు, కోతుల బెడదతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, వాటిని నివారించేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని క్యాతనపల్లి మున్సిపాలిటీ ప్రజలు కమిషనర్ వెంకటనారాయణ దృష్టికి తీసుకువచ్చారు. 'సాక్షి' ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. పట్టణంలోని ఆయా వార్డుల ప్రజల నుంచి సమస్యలు వెల్లువెత్తాయి. ఆర్‌కేపీలో శిథిలమైన రోడ్ల కారణంగా నరకయాతన పడుతున్నామని, వెంటనే రోడ్ల నిర్మాణాలు చేపట్టాలని, పలు వార్డుల్లో డ్రైనేజీల నిర్మాణాలు చేపట్టాలని అన్నారు. ప్రజల సమస్యలను ఓపిగ్గా విన్న కమిషనర్ పరిష్కారానికి హామీనిచ్చారు. ప్రధానంగా కుక్కల నివారణపై ఫోన్ ఇన్ కార్యక్రమం జరిగిన వెంటనే సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.

ప్రశ్న: రామకృష్ణాపూర్‌లోని ప్రధాన కూడళ్లలో రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. విఠల్‌నగర్ నుంచి స్టేషన్‌రోడ్, సూపర్‌బజార్ మార్గాల్లో రోడ్లు పూర్తిగా గుంతలమయమై ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ మార్గంలో లైట్లు ఏర్పాటు చేసినా వెలగడం లేదు. పశువులు ఇష్టారీతిన రోడ్లపైకి వస్తున్నాయి. నియంత్రించేందుకు గోశాలను ఏర్పాటు చేయాలి.
– జంగంపెల్లి మల్లయ్య, విఠల్‌నగర్

కమిషనర్: రోడ్ల నిర్మాణాలు త్వరలోనే చేపడుతాం. లైటింగ్ ఎక్కడెక్కడ రావడం లేదో మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకుంటాం. పట్టణంలో గోశాల ఏర్పాటుకు కృషి చేస్తాం.

ప్రశ్న: పాత తిమ్మాపూర్‌లో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉంది. గ్రామ పంచాయతీగా ఉన్నప్పటి నుంచి ఇప్పటివరకు డ్రైనేజీలు లేవు. మా ఇంటి ఎదుటే నీరు చేరి దుర్గంధం వ్యాపిస్తోంది. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. – గద్దం అంజయ్య, 9వ వార్డు, పాత తిమ్మాపూర్

కమిషనర్: కొత్త డ్రైనేజీల నిర్మాణం కోసం ఇప్పటికే ప్రతిపాదనలు పంపించాం. అనుమతులు రాగానే నిర్మాణం చేపడుతాం.

ప్రశ్న: బీజోన్ శ్రీనివాసనగర్‌లో హరితహారం కింద చెట్లు నాటారు కానీ పట్టించుకోవడం లేదు. ఈ ప్రాంతంలో పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి ఇబ్బందికరంగా ఉంది. పెరిగిన పిచ్చిమొక్కలు తాగుబోతులకు అడ్డాగా మారాయి.
– ముద్దసాని శ్రీనివాస్, శ్రీనివాస్‌నగర్, బీజోన్

కమిషనర్: మీరు చెప్పిన స్థలం సింగరేణి పరిధిలో ఉంది. సింగరేణి వారు మాకు స్థలం అప్పగిస్తే భూమి చదును చేయించి వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తాం. తాగడానికి ఎవరైనా వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. హరితహారం మొక్కలను పరిరక్షిస్తాం.

ప్రశ్న: పట్టణంలో కుక్కలు, కోతుల సమస్య తీవ్రంగా ఉంది. బయటకు వెళ్లాలంటేనే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. కోతులు ఇళ్లలోకి చొరబడుతూ దాడులు చేస్తున్నాయి. కుక్కలు, కోతుల నివారణకు వెంటనే చర్యలు తీసుకోవాలి.
– దండు సదానందం, రామాలయం

కమిషనర్: కుక్కల నివారణకు చర్యలు చేపడుతున్నాం. త్వరలోనే వాటిని జిల్లాలోని ఏబీసీ సెంటర్‌కు తరలించి స్టెరిలైజ్ చేపిస్తాం.

ప్రశ్న: పట్టణంలోని భగత్‌సింగ్‌నగర్ డ్రైనేజీల్లో పూడికతీత పనులు సరిగా చేపట్టడం లేదు. తీవ్ర దుర్గంధం వ్యాపిస్తోంది. అక్కడక్కడ తీస్తూ పలు చోట్ల వదిలేస్తున్నారు. – రమేష్, భగత్‌సింగ్ నగర్

కమిషనర్: సానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను పంపించి పూడికతీత పనులు సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: మున్సిపాలిటీ పరిధిలోని గద్దెరాగడి సాయికుటీర్ ప్రాంతంలో మున్సిపాలిటీ వాటర్ రావడం లేదు. లైన్ వేసి ట్యాప్ కనెక్షన్ ఇచ్చినా నీరు రావడం లేదు. పలు చోట్ల రోడ్డు కూడా అసంపూర్తిగానే వేశారు.
– ముప్పారపు కొమురయ్య, సాయికుటీర్

కమిషనర్: నీటి సమస్య పరిష్కారం కోసం సంబంధిత అధికారిని వెంటనే పంపిస్తా. అసంపూర్తిగా వేసిన రోడ్డును కూడా వెంటనే పూర్తిచేయిస్తాం.

ప్రశ్న: తిమ్మాపూర్‌లో 11 కేవీ విద్యుత్ హైటెన్షన్ వైర్లు ఇళ్ల మీద నుంచే పోతున్నాయి. గతంలో తీగలు తెగిపడి పలువురికి ప్రాణాపాయం తప్పింది. ఇళ్లపై ప్రమాదకరంగా ఉన్న హెచ్‌టీ లైన్‌ను మార్చాలి. – పారుపెల్లి శ్రీనివాస్, 9వ వార్డు, తిమ్మాపూర్

కమిషనర్: హైటెన్షన్ విద్యుత్ లైన్ మార్పిడి కోసం సంబంధిత అధికారులకు విన్నవిస్తా.

ప్రశ్న: పట్టణంలోని 12వ వార్డులో కుక్కలు, కోతుల బెడద తీవ్రంగా ఉంది. సింగరేణి అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు. కుక్కలు, కోతుల దాడితో చాలామంది గాయాలపాలయ్యారు. సమస్యను పరిష్కరించాలి. – ఎండీ.హుస్సేన్ షరీఫ్, కాకతీయకాలనీ, 12 వార్డు

కమిషనర్: మొదట కుక్కల నివారణ కోసం చర్యలు తీసుకుంటున్నాం. ఈ విషయమై ఇప్పటికే మా కు ఉన్నతాధికారుల నుంచి గైడ్‌లైన్స్ వచ్చాయి. కుక్కల నియంత్రణ తర్వాత కోతులను అరికట్టేందుకు కూడా చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: బీజోన్ మార్కెట్ ఏరియాలోని పలు దుకాణాల వెనుక డ్రైనేజీలు లేవు. దీంతో షాపుల వెనక మురుగు నీరు చేరి అధ్వానంగా ఉంటోంది. డ్రైనేజీలను నిర్మించాలి.
– మారపెల్లి రవి, బీజోన్

కమిషనర్: డ్రైనేజీల నిర్మాణం కోసం కొత్త ప్రతిపాదనలు పంపించాం. త్వరలోనే నిర్మాణపు పనులు ప్రారంభిస్తాం.

సమస్యల పరిష్కారానికి కృషి

- మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్
- 'సాక్షి' ఫోన్ ఇన్‌కు విశేష స్పందన



మున్సిపల్ కమిషనర్ వెంకటేష్

బెల్లంపల్లి: పట్టణ ప్రజలు ప్రస్తావించిన సమస్యలను ప్రాధాన్యత క్రమంలో సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని బెల్లంపల్లి మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ ఆకుల వెంకటేష్ అన్నారు. పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సోమవారం 'సాక్షి' ఫోన్ ఇన్ నిర్వహించిన విశేష స్పందన లభించింది. ప్రజలు పలు సమస్యలను ఏకరువు పెట్టారు. పలు సమస్యలను కమిషనర్ నమోదు చేసుకుంటూ ప్రజలకు ఓపికగా సమాధానాలు చెప్పారు.

ప్రశ్న: పట్టణంలో రోజువారీగా చెత్త సేకరించడం లేదు. దోమలు వృద్ధి చెంది ఇబ్బందులు పడుతున్నాం. బజార్‌ఏరియాలో చెత్త బండి వచ్చేది తెలియడం లేదు. మురికినీటి కాలువను శుభ్రం చేయడం లేదు. చెత్త పేరుకుపోయింది. భూడిదగడ్డబస్తీలో మురికికాలువలు లేక దుర్గంధం వ్యాపిస్తోంది.
– కటకం సతీష్‌కుమార్, మాజీ కౌన్సిలర్, కొత్త బస్టాండ్ ఏరియా, జుగల్ కిశోర్ ఛాండక్, బజారు ఏరియా, బొలిశెట్టి ప్రభాకర్, 24 డీప్ ఏరియా, ఆకాష్, 21వ వార్డు, భూడిదగడ్డ బస్తీ

కమిషనర్: మున్సిపాల్టీలో సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. గతంలో సింగరేణి కంపెనీ పారిశుధ్య పనులు చేయించేది. రెవెన్యూ పరం చేయడంతో ఆ భారం మున్సిపాల్టీపై పడింది. స్పెషల్ డ్రైవ్ నిర్వహించి శుభ్రం చేయిస్తాం. చెత్త బండి వచ్చినట్లు తెలియడానికి విజిల్ వేయిస్తాం.

ప్రశ్న: 17వ వార్డులు పందులు, కుక్కల బెడద తీవ్రంగా ఉంది. పిల్లలు స్కూల్‌కు వెళ్లడానికి భయపడుతున్నారు. టేకులబస్తీలో కోతుల సమస్య నివారణకు చర్యలు తీసుకోండి.
– సిలివేరి సత్యనారాయణ, మోదంపల్లి కిరణ్‌కుమార్, టేకులబస్తీ

కమిషనర్: కుక్కలు, పందులు, కోతులను వధించే అధికారం మున్సిపాల్టీకి లేదు. జిల్లా కేంద్రంలో ఎనిమల్ కేర్ సెంటర్ ప్రారంభించగానే కుక్కలు, కోతలకు సంతానోత్పత్తి నివారణకు శస్త్రచికిత్సలు చేయిస్తాం.

ప్రశ్న: దాబా నుంచి గాంధీనగర్ వరకు సెంట్రల్ లైటింగ్ వేయించండి. సుబ్బారావుపల్లికి రోడ్డు సౌకర్యం కల్పించాలి. వీధి దీపాలు ఏర్పాటు చేయాలి.
– గుండా వెంకటస్వామి, గాంధీనగర్, మేకల రాజశేఖర్, సుబ్బారావుపల్లి

కమిషనర్: సెంట్రల్ లైటింగ్ కోసం ఎన్‌హెచ్ఏఐ అధికారులకు లేఖ రాస్తా. ప్రస్తుతానికి మున్సిపాల్టీకి నిధుల కొరత ఉంది. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపి మంజూరు కాగానే రోడ్డు నిర్మాణం చేపడుతాం. వీధిలైట్లు త్వరలోనే ఏర్పాటు చేయిస్తాం.

ప్రశ్న: బజారుఏరియాలో భూకబ్జాలపై చర్యలు తీసుకోండి.
– కొలిపాక శ్రీనివాస్, కాంట్రాక్టర్‌బస్తీ

కమిషనర్: సమాచారం వచ్చిన ప్రాంతానికి వెళ్లి భూ కబ్జాలు, అక్రమ నిర్మాణాలు తొలగిస్తున్నాం. ఇప్పటికే వంద ఇళ్లకు నోటీసులు అందజేశాం.

ప్రశ్న: ఓపెన్ జిమ్ కోసం కేటాయించిన స్థలం కబ్జా అయింది. చర్యలు తీసుకోండి.
– పి.వంశీకృష్ణ, పోస్టాఫీసుబస్తీ, ఎలిగేటి మల్లేష్, మాజీ కౌన్సిలర్

కమిషనర్: ఓపెన్ జిమ్ స్థలం అన్యాక్రాంతం విషయం మా నోటీసులో ఉంది. ఆ ప్రాంతానికి సిబ్బంది వెళ్తే ఘర్షణ పడుతున్నారు. టాస్క్‌ఫోర్స్ దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: కాంట్రాక్టర్ బస్తీలో డ్రెయినేజీ సమస్య తీవ్రంగా ఉంది. బజార్‌ఏరియాలో దుకాణాల ముందు తోపుడు బండ్లు పెడుతున్నారు. చర్యలు తీసుకోండి. ప్రగతి జూనియర్ కళాశాల చెరువులో మురికి కాలువ పూడిక నిండింది. – ఎ.రవిబాబు, కాంట్రాక్టర్‌బస్తీ, గోపాల్‌శర్మ, బజారు ఏరియా, తొటం సొమ్మ, గద్దెపల్లి నాగరాజు, కాంట్రాక్టర్‌బస్తీ,
– దుర్గం శ్రీనివాస్, శాంతిఖనిబస్తీ

కమిషనర్: డ్రైనేజీ పూడిక తీయించడానికి చర్యలు తీసుకుంటాం. దుకాణాల ముందు హద్దులు ఏర్పాటు చేయించి బండ్లు అడ్డంగా పెట్టకుండా చర్యలు తీసుకుంటాం. మంగళవారం సిబ్బందిని పంపించి పూడికతీయించే చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: అసంపూర్తిగా ఉన్న మురికి కాలువల నిర్మాణం పూర్తి చేయించండి.
– డి.పూలమ్మ, మాజీ కౌన్సిలర్, హన్మాన్ బస్తీ

కమిషనర్: అసంపూర్తి మురికి నీటి కాలువల నిర్మాణానికి నిధులు కేటాయించాం. త్వరలోనే టెండర్ పిలిచి ఎండాకాలం పూర్తయ్యేలోపు పనులు పూర్తి చేయిస్తాం.

ప్రశ్న: 16వ వార్డులో మురికి కాలువలు శిథిలావస్థకు చేరాయి. కొత్తగా కాలువల నిర్మాణానికి చర్యలు తీసుకోండి.
– ఎలిగేటి శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్, ఎలిగేటి సాయికిరణ్, పోస్టాఫీసు బస్తీ

కమిషనర్: మున్సిపాలిటీకి నిధుల మంజూరు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. ఇందుకోసం ఎమ్మెల్యే తీవ్రంగా యత్నాలు చేస్తున్నారు. నిధులు మంజూరు కాగానే నిర్మాణానికి కృషి చేస్తాం.

ప్రశ్న: మురికి కాలువలు కబ్జా అవుతున్నాయి. చర్యలు తీసుకోండి.
– కిష్టస్వామి, 24 డీప్‌ఏరియా

కమిషనర్: ఆ సమస్య ఇదివరకే నా దృష్టికి వచ్చింది. ఆక్రమణ చేసి వేసుకున్న ఫెన్సింగ్‌ను తొలగిస్తాం.

ప్రశ్న: రోడ్డుపై స్క్రాప్ వేయకుండా కట్టడి చేయండి.
– ఎ.మనోహర్, మహ్మద్ ఖాశీం బస్తీ, 30 వార్డు

కమిషనర్: స్క్రాప్ దుకాణం యజమానికి కొద్ది రోజుల క్రితం రూ.10 వేల జరిమానా విధించాం. పద్ధతి మార్చుకోక పోతే షాపు సీజ్ చేస్తాం.

కంటి వెలుగు గడువులోగా పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

మంచిర్యాలటౌన్: కంటి వెలుగు రెండో విడత కార్యక్రమం లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుబ్బరాయుడు, వైద్యులు, ప్రోగ్రాం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 1,53,342మందికి కంటి పరీక్షలు నిర్వహించి 34,085మందికి రీడింగ్ గ్లాసులు పంపిణీ చేశామని, 26,807మందికి ప్రిస్క్రిప్షన్ గ్లాసుల కోసం పంపించామని తెలిపారు. 112గ్రామ పంచాయతీలు, 55వార్డుల్లో కంటి వెలుగు శిబిరాల లక్ష్యాలను పూర్తి చేశామని తెలిపారు. వైద్యులు సమయపాలన పాటించాలని, జిల్లా వైద్యాధికారి ఆకస్మికంగా తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ నీరజ, డాక్టర్ అనిత, డాక్టర్ విజయపూర్ణిమ, డాక్టర్ విజయనిర్మల, డీడీఎంలు, డెమో బుక్క వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పాఠశాలలు ప్రారంభానికి సిద్ధం చేయాలి

పాతమంచిర్యాల: మార్చి నెలాఖరులోగా మన ఊరు–మన బడి కార్యక్రమంలో మొదటి విడత ఎంపికైన 248 పాఠశాలల అభివృద్ధి పనులు పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ రాహుల్, ట్రెయినీ కలెక్టర్ గౌతమి, జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లుతో కలిసి ఎగ్జిక్యూటివ్, ఏజెన్సీ, ప్రజారోగ్యం, పంచాయతీరాజ్, రోడ్లు, భవనాలు, గిరిజన సంక్షేమం, ఏజెన్సీలతో మన ఊరు–మన బడి కార్యక్రమంపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 36 ఆదర్శ పాఠశాలల్లో మిగిలి ఉన్న పెయింటింగ్, గ్రీన్ చాక్‌బోర్డు, ప్రహరీ, బెంచీలు, మౌలిక సదుపాయాల పనులు పూర్తి చేయాలని చెప్పారు. మండలాల వారీగా ఆయా పాఠశాలల్లో మూత్రశాలలు, వంటశాలలు, భోజన శాలలు, ప్రహరీ పనులు వేగవంతం చేయాలన్నారు. పనుల నిర్వహణలో ఏమైనా సమస్యలు ఉన్నట్లయితే అదనపు కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి దృష్టికి తీసుకురావాలని తెలిపారు.

క్లుప్తంగా

చైర్ కార్ మ్యాన్‌రైడింగ్ సిస్టం పరిశీలన



పరిశీలిస్తున్న డీడీఎంఎస్ అధికారులు

శ్రీరాంపూర్(మంచిర్యాల): ఆర్కే 7 గనిలో సాంకేతిక కారణాలతో నిలిచిపోయిన చైర్ కార్ మ్యాన్‌రైడింగ్ సిస్టంను డెప్యూటీ డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ(డీడీఎంఎస్) అధికారులు సోమవారం పరిశీలించారు. గతంలో బ్రేకింగ్ సిస్టంలో సాంకేతిక లోపాలు రావడంతో డీడీఎంఎస్ ఆదేశాలతో ఆర్నెళ్లుగా యంత్రాన్ని నిలిపివేశారు. ఇటీవలే దానికి మరమ్మతు చేయడంతో డీడీఎంఎస్ అధికారులు వచ్చి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏజెంట్ వెంకటేశ్వర్‌రెడ్డి, గని మేనేజర్ సాయి ప్రసాద్, రక్షణాధికారి రవిశంకర్, ఏరియా ఇంజినీర్ రమేశ్‌బాబు, గ్రూప్ ఇంజినీర్ రాజా రవిచరణ్, పిట్ ఇంజినీర్ ప్రవీణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సార్పీ 3లో లేఆఫ్ కొనసాగింపు

శ్రీరాంపూర్: ఎస్సార్పీ 3 గనిలో సోమవారం కూడా లే ఆఫ్ కొనసాగింది. గురువారం గనిలో గ్యాస్ రావడంతో అధికారులు ఆ స్థలాన్ని మూసివేసి లే ఆఫ్ ప్రకటించారు. సోమవారం ఉదయం గ్యాస్ శాంపిల్స్ సేకరించిన కంపెనీ అధికారులు గ్యాస్ పూర్తిగా కంట్రోల్ అయ్యిందని నిర్ధారణకు వచ్చారు. అయితే మరోరోజు వరకు అబ్జర్వేషన్‌లో ఉంచడం కోసం డీడీఎంఎస్ అధికారి లే ఆఫ్ ఉంచాలని ఆదేశించారు. మంగళవారం పరిస్థితిని సమీక్షించి నిర్ణయం తీసుకోనున్నారు.

సౌత్ ఇండియా సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా సోమశేఖర్



సోమశేఖర్‌ను అభినందిస్తున్న జయరాం పల్సనియా

రెబ్బెన(ఆసిఫాబాద్): రెబ్బెన మండలంలోని నంబాల సర్పంచ్ చెన్న సోమశేఖర్‌కు అరుదైన గౌరవం దక్కింది. సోమవారం న్యూఢిల్లీలో జరిగిన జాతీయ సర్పంచుల సంఘం సమావేశంలో సోమశేఖర్‌ను సౌత్ ఇండియా సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా నియమించారు. ఈ సందర్భంగా సర్పంచుల సంఘం జాతీయ అధ్యక్షుడు జయరాం పల్సనియా పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా సోమశేఖర్ మాట్లాడుతూ సౌత్ ఇండియాలో ఉన్న తమిళనాడు, కేరళ, కర్ణాటక, ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లోని సర్పంచుల సమస్యల పరిష్కారానికి, హక్కుల సాధనకు కృషి చేస్తానన్నారు.

‘డబుల్’ మిస్టేక్!



మున్సిపల్ కార్యాలయంలో జాబితాలో పేర్లు చూసుకుంటున్న దరఖాస్తుదారులు

- అర్హతలున్నా జాబితా నుంచి తొలగింపు
- లిస్టులో అనర్హుల పేర్లు
- మూడు రోజుల్లో 184 అభ్యంతరాలు స్వీకరణ



అనర్హులుగా పేర్కొన్న వారి నుంచి అభ్యంతరాలు స్వీకరిస్తున్న మున్సిపల్ అధికారులు

మంచిర్యాలటౌన్: డబుల్ బెడ్‌రూం ఇల్లు పొందేందుకు తమకు అన్ని అర్హతలు ఉన్నా అనర్హులుగా గుర్తించి జాబితా నుంచి పేర్లు తొలగించారని ఇల్లు లేని నిరుపేదలు ఆందోళన చెందుతున్నారు. మంచిర్యాల మున్సిపాలిటీ పరిధిలో ఇల్లులేని నిరుపేదలు 2,958 మంది ప్రభుత్వం అందజేస్తున్న డబుల్ బెడ్‌రూం కోసం మీసేవలో దరఖాస్తు చేసుకున్నారు. ఆయా దరఖాస్తులను ఇంటింటికీ వెళ్లి పరిశీలించిన రెవెన్యూ అధికారులు అందులో 1,548 మందిని అర్హులుగా, 1,410 మందిని అనర్హులుగా గుర్తించారు. ఇటీవల అర్హులు, అనర్హుల జాబితాల వివరాలను మంచిర్యాల మున్సిపల్ కార్యాలయంలో ప్రదర్శించారు. తహసీల్దార్ కార్యాలయం, కలెక్టరేట్‌లో దరఖస్తు చేసుకున్న వారిని జాబితాలో చేర్చకుండా, కేవలం మీసేవ ద్వారా దరఖాస్తు చేసుకున్న వారినే అధికారులు పరిగణలోకి తీసుకున్నారు. వీటిపై ఈ నెల 25, 26, 27 తేదీల్లో మున్సిపల్ కార్యాలయంలో అభ్యంతరాలను స్వీకరించగా 184 మంది అర్హులైనా తమపేర్లను ఎలా తొలగించారంటూ అభ్యంతరం వ్యక్తం చేశారు.

ఒక్కో ఇంటికి రూ.లక్ష!

మంచిర్యాల మున్సిపాలిటీలో 650 డబుల్ బెడ్‌రూం ఇళ్లను నిర్మించారు. ఆయా ఇళ్ల నిర్మాణం కోసం భూములను కోల్పోయిన 30 కుటుంబాలకు గతంలోనే ఇళ్లను పంపిణీ చేశారు. మిగిలిన 620 ఇళ్లకుగానూ 330 పంపిణీ చేసేందుకు అధికారులు రంగం సిద్ధం చేశారు. ఇళ్ల సంఖ్య తక్కువగా ఉండి లబ్ధిదారుల సంఖ్య ఎక్కువగా ఉండడంతో కొంత మంది దళారులు, ప్రజాప్రతినిధులు ఇళ్లు ఇప్పిస్తామంటూ ఒక్కొక్కరి వద్ద నుంచి రూ.లక్ష వరకు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. డబ్బులు ఇవ్వని వారి పేర్లను అనర్హుల జాబితాలో చేర్చారని, అన్ని అర్హతలు ఉన్నా తమను ఎలా తొలగిస్తారని దరఖాస్తు దారులు ఆందోళన చెందుతున్నారు. అర్హుల జాబితాలో చేర్చాలని కోరుతున్నారు.

అద్దె ఇంట్లో ఉంటున్నా..



నేను ట్రాన్స్‌జెండర్‌ని. నాకు సొంత ఇల్లు లేదు. అద్దె ఇంట్లో ఉంటున్నా. 2021 మే 5 న మీసేవలో దరఖాస్తు చేసుకున్నా. వివరాలు సేకరించిన అధికారులు నేను అర్హురాలినని రాసుకుని వెళ్లారు. కానీ అనర్హుల జాబితాలో నాపేరు చేర్చారు. అధికారులను అడిగితే సమాధానం ఇవ్వడం లేదు. – జంగపల్లి అంజలి, హమాలివాడ

‘మిస్టర్ తెలంగాణ’ శివశంకర్



మిస్టర్ తెలంగాణ విజేత శివశంకర్‌కు బహుమతి అందిస్తున్న నిర్వాహకులు



మిస్టర్ ఆదిలాబాద్ విజేత అన్వర్

బెల్లంపల్లి: మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర బాడీ బిల్డింగ్ చాంపియన్ షిప్ పోటీలు ముగిసాయి. బెల్లంపల్లి సైకి జిమ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోటీలు సోమవారం తెల్లవారుజాము వరకు సాగాయి. దేహదారుఢ్య ప్రదర్శనతో హైదరాబాద్‌కు చెందిన శివశంకర్ మిస్టర్ తెలంగాణ ఐరన్ మెన్ టైటిల్‌ను గెలుచుకున్నాడు. బహుమతిగా రూ.50వేల నగదు అందుకున్నాడు. మిస్టర్ ఆదిలాబాద్ టైటిల్‌ను ఎస్‌కే.అన్వర్(మంచిర్యాల) సాధించగా, రూ.15వేల నగదు బహుమతి అందుకున్నాడు. మిస్టర్ జూనియర్ తెలంగాణ టైటిల్‌ను వి.విశాల్‌కుమార్(హైదరాబాద్) సొంతం చేసుకున్నాడు. బాడీ బిల్డింగ్ పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా 120 మంది పాల్గొన్నారు. దివ్యాంగులు కూడా పోటీల్లో పాల్గొని అందరినీ ఆకట్టుకున్నారు. అంతకుముందు దాతలు, మాజీ బాడీ బిల్డర్లను నిర్వాహకులు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్, ఏసీపీ పంతాటి సదయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేణికుంట్ల ప్రవీణ్, తెలంగాణ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ కార్యదర్శి హరీష్‌సింగ్, తాండూర్ సీఐ జగదీష్, జిల్లా బాడీ బిల్డింగ్ అసోషియేషన్ అధ్యక్షుడు తోట తిరుపతి, కార్యదర్శి రాకేష్, బెల్లంపల్లి కార్యదర్శి పన్నాల సదానందం, మిస్టర్ ఇండియా టైటిల్ హోల్డర్లు పి.రాజు, సంతోష్‌కుమార్, మిస్టర్ కోలిండియా జె.నాగమల్లేశ్వర్‌రావు, ఓరం సురేష్, జాతీయ బాడీ బిల్డింగ్ జడ్జీలు ఎసప్ప, రంజన్‌రెడ్డి, మహ్మద్ ఇంతియాజ్, బెల్లంపల్లి సైకిజిమ్ నిర్వాహకులు ఎస్.బాలకృష్ణ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

తాండూర్(బెల్లంపల్లి): బాలికను ప్రేమ పేరుతో వేధించిన యువకుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్సై సమ్మయ్య తెలిపారు. మండల కేంద్రానికి చెందిన ఓ మైనర్ బాలికను తంగళ్లపల్లి గ్రామానికి చెందిన రజినీకాంత్ అనే యువకుడు తనను ప్రేమించాలని వేధింపులకు గురిచేశాడు. బాధితురాలు తల్లిదండ్రులకు చెప్పడంతో ఆదివారం రాత్రి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉరేసుకుని కార్మికుడు ఆత్మహత్య



పోశం మృతదేహం

రామకృష్ణాపూర్(చెన్నూర్): రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కోటేశ్వర్ రావుపల్లెకు చెందిన చిలుముల పోశం (61)అనే సింగరేణి కార్మికుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై ఫరీద్ తెలిపిన వివరాల ప్రకారం ఎస్సార్పీ 3 గనిలో విధులు నిర్వర్తిస్తున్న పోశం కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో తరచూ విధులకు గైర్హాజర్ అవుతుండడంతో సంస్థ యాజమాన్యం ఉద్యోగం నుంచి డిస్మిస్ చేసింది. కోర్టు ద్వారా తిరిగి ఉద్యోగం పొందినా మద్యం సేవించడం మాత్రం మానలేదు. అంతేకాకుండా తన ఇద్దరు కుమారులు ఏ పనిచేయకుండా ఖాళీగా ఉంటుండడంతో తాను చనిపోతేనైనా ఒకరికి తన ఉద్యోగం వస్తుందని తరచూ కుటుంబ సభ్యులతో చెప్పేవాడు. ఈ నేపథ్యంలోనే ఆదివారం రాత్రి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోందని ఎస్సై పేర్కొన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక డంపులు సీజ్

జైపూర్: మండలంలోని రసూల్‌పల్లి పెద్దవాగు నుంచి అక్రమంగా ఇసుక తరలించి ఆయా ప్రాంతాల్లో నిల్వచేసిన 150 ట్రిప్పుల ఇసుకను సీజ్ చేసినట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు. ఇసుక విలువ సుమారు రూ.లక్ష 50 వేలు ఉంటుందన్నారు. కట్కూరి సత్యనారాయణకు చెందిన 10 ట్రిప్పులు, అంబల్ల సంపత్‌రెడ్డికి చెందిన 130 ట్రిప్పులు, లింగస్వామికి చెందిన 10 ట్రిప్పుల ఇసుకను సీజ్ చేసి తదుపరి చర్యలకు రెవెన్యూశాఖ అధికారులకు అప్పగించినట్లు ఆయన పేర్కొన్నారు.

జాతీయస్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విజేతలను అభినందిస్తున్న ఎస్సై శ్వేత

చెన్నూర్: బెల్లంపల్లి పట్టణంలోని సింగరేణి టీసీఓఎస్ క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో చెన్నూర్ ఎస్‌జీవో పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ప్రతిభ కనబర్చి బంగారు, వెండి పతకాలు సాధించినట్లు కరాటే ఇన్‌స్ట్రక్టర్ రామగిరి స్వామి తెలిపారు. ఆర్.సృజన్ బంగారు, దాదా శరణ్య, సనాతణిని వెండి పతకాలు గెల్చుకున్నారు. విజేతలను ఎస్సై శ్వేత, పాఠశాల కరస్పాండెంట్ మేడ శ్రావణ్‌రెడ్డి అభినందించారు.

పథకాలు పకడ్బందీగా అమలు చేయాలి

పాతమంచిర్యాల: ప్రభుత్వ పథకాలు పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ నుంచి వివిధ శాఖల అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో చేపట్టిన క్రీడాప్రాంగణాలు, బృహత్ ప్రకృతి వనాల ఏర్పాటుకు ప్రభుత్వ భూమిని గుర్తించాలన్నారు. ఎంఎల్ఎస్ పాయింట్ గోదాములను పరిశీలించి నివేదికలు అందించాలన్నారు. ఆధార్ అనుసంధానం ప్రక్రియ వందశాతం పూర్తయ్యేలా తహసీల్దార్లు కార్యాచరణ రూపొందించాలన్నారు.

కార్మిక సమస్యలపై ఉద్యమ కార్యాచరణ

- ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్



మాట్లాడుతున్న జనక్ ప్రసాద్

శ్రీరాంపూర్(మంచిర్యాల): దేశవ్యాప్తంగా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఐఎన్టీయూసీ ఆధ్వర్యంలో ఉద్యమ కార్యాచరణ చేపట్టామని ఆ యూనియన్ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం నస్పూర్–శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 22, 23 తేదీల్లో ఢిల్లీలో జరిగిన యూనియన్ 33వ ప్లీనరీలో దేశ వ్యాప్తంగా 10 జాతీయ సంఘాలను కలుపుకుని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై ఉద్యమాలు చేయడానికి తీర్మానం చేశామన్నారు. కార్మిక చట్టాలు సవరణ చేస్తూ ప్రభుత్వరంగ సంస్థల్లో పనిచేసే కార్మికుల హక్కులను కాలరాస్తోందన్నారు. బీఐఎఫ్‌ఆర్ స్థానంలో తీసుకువచ్చిన లా ట్రిబునల్ ఎత్తివేసి పాత విధానమే కొనసాగించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి కాంపెల్లి సమ్మయ్య, బ్రాంచి ఉపాధ్యక్షుడు జే.శంకర్‌రావు, సెంట్రల్ ఉపాధ్యక్షుడు కలవేని శ్యాం, నాయకులు సీహెచ్ భీంరావు, కృష్ణమూర్తి, భీంరావు పాల్గొన్నారు.

జాతీయ కౌన్సిల్‌కు ఎన్నిక

ఐఎన్టీయూసీ జాతీయ కార్యవర్గంలో సింగరేణి నుంచి జనక్‌ప్రసాద్‌తో పాటు కౌన్సిల్ సభ్యులుగా కేంద్ర నర్సింహారెడ్డి, ధర్మపురి, కాంపెల్లి సమ్మయ్య, రాజమౌళి, జే శంకర్‌రావుకు స్థానం కల్పించినట్లు నేతలు తెలిపారు.

అర్జీలు సత్వరం పరిష్కరించాలి

- ఐటీడీఏ ఏపీవో జనరల్ కనక భీంరావ్



అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

ఉట్నూర్: గిరిజనుల అర్జీలు సత్వరం పరిష్కరించాలని ఐటీడీఏ ఏపీవో జనరల్ కనక భీంరావ్ అన్నారు. ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఆయన గిరిజనుల నుంచి అర్జీలు స్వీకరించారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 36 అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా కనక భీంరావ్ మాట్లాడుతూ ప్రతీ అర్జీని శాఖల అధికారులు పరిశీలించి న్యాయం చేయాలని అన్నారు. పీవీటీజీ అధికారి బాస్కర్, డీపీవో ప్రవీణ్, ఓఎస్డీ క్రిష్ణయ్య, ఏవో రాంబాబు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

- తన కుటుంబ పోషణ, స్వయం ఉపాధి కోసం ఐటీడీఏ ద్వారా ఆర్థిక చేయుత అందించాలని గుడిహత్నూర్ మండలం మచ్చాపూర్‌కు చెందిన నైతం లింబాజీ అర్జీ పెట్టుకున్నాడు.
- గిరి వికాసం పథకం ద్వారా బోరుబావి, విద్యుత్ మోటారు మంజూరు చేయాలని లింగాపూర్ మండలం కొత్తపల్లికి చెందిన సురేశ్ విన్నవించాడు.
- తన పంట సాగు కోసం ఎడ్ల జత అందించాలని గుడిహత్నూర్ మండలం తోషంకు చెందిన అనసూయబాయి వేడుకుంది.
- తనకు డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేయాలని సిర్పూర్(యూ) మండల కేంద్రానికి చెందిన లింబానాయక్ అర్జీ పెట్టుకున్నాడు.
- పోడుభూములకు అటవీ హక్కు పత్రం అందించాలని కెరమెరి మండలం బాబేఝరికి చెందిన కనక తుకారాం వేడుకున్నాడు.
- తాను బీఎడ్, టెట్ పూర్తి చేశానని, ఆశ్రమ పాఠశాలలో సీఆర్టీగా ఉద్యోగ అవకాశం కల్పించాలని గాదిగూడ మండలం ఊట్లకు చెందిన రాథోడ్ స్వప్న విన్నవించింది.

అంత్యక్రియలకు వచ్చి అనంతలోకాలకు

- బైక్ పైనుంచి పడి యువకుడు మృతి



తరుణ్ (ఫైల్)

జన్నారం(ఖానాపూర్): తన స్నేహితుని సోదరుడి అంత్యక్రియలకోసమని స్వగ్రామానికి వచ్చి రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. జన్నారం మండలం చింతలపల్లి గ్రామానికి చెందిన దాసరి శ్రీనివాస్, స్వప్న దంపతుల కుమారుడు దాసరి తరుణ్ (20) డిగ్రీ పూర్తి చేశాడు. చింతగూడకు చెందిన అతని స్నేహితుడు ధనుష్‌తో కలిసి హైదరాబాద్‌లో ఆర్మీ శిక్షణ తీసుకుంటున్నాడు. ధనుష్ సోదరుడు హర్ష ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలుసుకుని చింతలపల్లికి వచ్చాడు. ఆదివారం అంత్యక్రియల్లో పాల్గొన్న తరుణ్ ఇంటికి వచ్చాడు. సాయంత్రం బైక్‌పై చింతగూడకు వెళ్లాడు. రాత్రి ఇంటికి తిరిగివస్తుండగా బొమ్మెన సమీపంలో బైక్ అదుపుతప్పి బండను ఢీకొట్టింది. ఘటనలో తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని తండ్రి శ్రీనివాస్ ఇరాక్ వెళ్లడంతో అంత్యక్రియలకు హాజరుకాలేకపోయాడు. దీంతో తల్లి స్వప్న కుమారుడి చితికి నిప్పంటించింది. కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తానాజీ నాయక్ తెలిపారు.

రజక వృత్తిదారులను ప్రభుత్వం ఆదుకోవాలి

- రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆశయ్య



మాట్లాడుతున్న ఆశయ్య

పాతమంచిర్యాల: కుల వృత్తిపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్న రజకులను ప్రభుత్వం ఆదుకోవాలని రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైల్ల ఆశయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని తాపీమేస్త్రీ సంఘ భవనంలో సోమవారం సంఘం జిల్లా మూడో మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రజకుల సంక్షేమం కోసం ప్రభుత్వం సబ్సిడీ రుణాలు ఇవ్వాలని, 50ఏళ్లు నిండిన వారికి పింఛన్ సౌకర్యం కల్పించాలని, రజకుల సామాజిక భద్రతకోసం చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధిశాఖ అధికారి వినోద్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో రజక వృత్తిదారుల కోసం మోడరన్ దోభీఘాట్ల నిర్మాణం చేపడతామన్నారు. ఈ సందర్భంగా రజకుల సమస్యల పరిష్కారం కోసం 9 తీర్మానాలను ప్రవేశపెట్టారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ద్యావనపల్లి లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి పైరాల రాములు, పట్టణ అధ్యక్షుడు పారుపల్లి శ్రీనివాస్, రాష్ట్ర కమిటీ సభ్యులు సంగెపు హన్మంతు, ముష్కర చందు, కొత్తకొండ పోచం, కంచర్ల రాజమల్లు, దుర్శెట్టి రాములు, రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల అభివృద్ధే లక్ష్యంగా పథకాలు



బోర్‌వెల్ పనులు ప్రారంభిస్తున్న కలెక్టర్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): గిరిజనుల అభివృద్ధే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశ పెడుతోందని ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు, కలెక్టర్ బాదావత్ సంతోశ్ అన్నారు. హాజీపూర్ మండలంలోని గఢ్‌పూర్, ర్యాలీ, నాగారం, చిన్నగోపాల్‌పూర్ గ్రామ పంచాయతీల్లోని బాబానగర్, నాగారం, పెద్దగోపాల్ గ్రామాలకు చెందిన ఏడుగురు లబ్ధిదారులకు సీఎం గిరి వికాస్ పథకంలో భాగంగా ట్రికార్ ఐటీడీఏ ఫండ్ కింద మంజూరైన బోర్‌వెల్ ఏర్పాటు పనులను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పథకంలో భాగంగా గిరిజన గ్రామాల్లోని బీడు భూములను సాగులోకి తెచ్చేందుకు పొలాల వద్ద బోర్‌వెల్‌లను ఏర్పాటు చేయిస్తుందన్నారు. రూ.4,65,765లతో 7 బోర్‌వెల్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా రూ.30,65,765లతో మోటార్లు, విద్యుత్ సౌకర్యం కూడా కల్పిస్తున్నట్లు తెలిపారు. వీటి కింద మొత్తం 50 ఎకరాలకు పైగా సాగునీరు అందుతుందన్నారు. మిషన్ కాకతీయ పథకం కింద గ్రామ చెరువును కూడా అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాహుల్, శిక్షణ కలెక్టర్ గౌతమి, ఎంపీపీ స్వర్ణలత, జెడ్పీటీసీ పూస్కూరి శిల్ప, వైస్ ఎంపీపీ బేతు రమాదేవి, సర్పంచ్ లక్ష్మి, ఎంపీటీసీ కొట్నాక అనూభాయి, రైతుబంధు సమితి మండల కన్వీనర్ శ్రీనివాసరావు, పీఏసీఎస్ చైర్మన్ సందెల వెంకటేశ్, మార్కెట్ కమిటీ చైర్మన్ సాగి వెంకటేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో క్రీడాకారుల ప్రతిభ



బహుమతి అందిస్తున్న కరాటే మాస్టర్లు

బెల్లంపల్లి: బెల్లంపల్లి టీసీఓఏ క్లబ్‌లో నిర్వహించిన ఫస్ట్ నేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్ షిప్ పోటీలు ఆదివారం రాత్రి ముగిశాయి. పదేళ్ల లోపు విభాగంలో వి.శ్రీహిత, విజ్జగిరి కీర్తిక, కొట్టే సహస్ర, భువన్ తేజ్, సహస్ర తన్వీ, అర్చన, సుస్మిత, సాహితి, అభిరూప్, యోగితశ్రీ, ఆర్యన్, హరిచందన, సాత్విక్, మణిచందన్, అభిరానందన్, భవిగ్న విజేతలుగా నిలిచారు. బ్లాక్‌బెల్ట్ విభాగంలో శ్లోక ప్రథమ బహుమతి, సంజీవ్ బ్రౌన్‌బెల్ట్, హర్షిక బ్లాక్ బెల్ట్ సాధించారు.

ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: జిల్లాలోని ఆదివాసీ బిరుదుగోండ్ (తోటి)లకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందేలా చూడాలని సంఘం నాయకులు సోమవారం కలెక్టర్ బాదావత్ సంతోష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేవలం కళను నమ్ముకుని జీవిస్తున్న తమకు ప్రభుత్వ పథకాలు అందడంలేదన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు వల్క చిలుకయ్య, ప్రధాన కార్యదర్శి కుర్సింగ వెంకటేశ్ పాల్గొన్నారు.

ట్రెయినీ కార్మికుడికి అస్వస్థత

బెల్లంపల్లి: మందమర్రి ఏరియాలోని శాంతిఖని గనిలో ఓ ట్రెయినీ కార్మికుడు సోమవారం అస్వస్థతకు గురయ్యాడు. గనిలో శిక్షణ తీసుకుంటున్న ఆయిల్ల సాయితేజ చాతిలో నొప్పివస్తోందని చెప్పి అకస్మాత్తుగా కిందపడిపోయాడు. గమనించిన గని అధికారులు వెంటనే సింగరేణి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఎలాంటి ప్రాణాపాయం లేదని, స్వల్ప అస్వస్థతకు గురయ్యాడన్నారు.

హక్కుల సాధనకు ఐక్యంగా ఉద్యమించాలి

- తెలంగాణ గౌడ సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ నర్సాగౌడ్



మాట్లాడుతున్న అమరవేణి నర్సాగౌడ్

రెబ్బెన(ఆసిఫాబాద్): హక్కుల సాధన కోసం గౌడ కులస్తులందరూ ఐక్యంగా ఉద్యమించాలని తెలంగాణ గౌడ సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ అమరవేణి నర్సాగౌడ్ అన్నారు. రెబ్బెన మండలం గోలేటి టౌన్‌షిప్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 40లక్షల పైచిలుకు జనాభా ఉన్న గౌడ కులస్తులు కల్లుగీత వృత్తి రక్షణ, హక్కుల సాధన కోసం, రాజ్యాధికారంలో వాటా కోసం పార్టీలకు అతీతంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఉద్యమాల ద్వారానే హక్కుల సాధన, రాజ్యాధికారం సాకారం అవుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గౌడ కులస్తులను అన్నిరంగాల్లో అణిచివేస్తోందన్నారు. కాగజ్‌నగర్‌లోని పటేల్‌గార్డెన్‌లో మార్చి 5న నిర్వహించనున్న జిల్లా మోకుదెబ్బ రెండో గౌడ మహాసభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో మోకుదెబ్బ జాతీయ ప్రధాన కార్యదర్శి రాగుల సిద్ది రాములుగౌడ్, జాతీయ ఉపాధ్యక్షుడు ముత్యం నర్సింహులు గౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంజనేయులుగౌడ్, రాష్ట్ర నాయకులు రాగుల కిరణ్‌కుమార్‌గౌడ్, కదిరె ఆంజనేయులుగౌడ్, మచ్చిమడ్ల స్వామిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రజక సంఘం జిల్లా అధ్యక్షుడిగా వెంకటేశ్

జైపూర్: రజక వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా రామారావుపేట ఉప సర్పంచ్ తంగేళ్లపెల్లి వెంకటేశ్ ఎన్నికయ్యారు. జిల్లా కేంద్రంలో సోమవారం సంఘం జిల్లా మూడో మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్‌ను నియమించినట్లు ప్రకటించారు.

అదృశ్యమైన యువతి ఆచూకీ లభ్యం

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ మండలం రాస్పెల్లి గ్రామానికి చెందిన అదృశ్యమైన యువతి ఆచూకీ లభించింది. కాగజ్‌నగర్ పట్టణంలో పోలీసులు యువతితో పాటు మరికొందరు యువకులను అదుపులోకి తీసుకుని విచారణ చేపడుతున్నారు. యువతిని వేరే రాష్ట్రానికి తరలించి వ్యభిచార కూపంలోకి దింపేందుకు యత్నించి ఉంటారన్న కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన ఐదుగురు, మండలంలోని అందవెల్లి గ్రామానికి చెందిన మరో యువకునితో పాటు వీరికి సహకరించిన ఇద్దరు మహిళలను అదుపులోకి తీసుకుని ఆరా తీస్తున్నారు. కొత్తసారసాల గ్రామానికి చెందిన మరో యువకుని కోసం కూడా పోలీసులు గాలిస్తున్నారు. మధ్యప్రదేశ్‌కు చెందిన ఓ మహిళ ప్రధాన సూత్రదారిగా ఈ వ్యవహారం నడిపిస్తున్నట్లు తెలుస్తోంది. ఈవిషయమై సీఐ నాగరాజును సంప్రదించగా యువతి అదృశ్యం కేసులో కొంతమందిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామన్నారు.